
# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 13 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## త్వరలోనే కొత్త రూ. 50 నోట్లు




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

త్వరలోనే భారత్ లో సరికొత్త 50 రూపాయల నోట్లు చలామణీలోకి రానున్నాయి. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సన్నాహాలు చేస్తోంది. ఆర్బీఐ నూతన గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో కూడిన ఈ కొత్త రూ.50 నోట్లను త్వరలోనే మార్కెట్లోకి విడుదల చేయనున్నారు. సంజయ్ మల్హోత్రా సంతకం కూడిన రూ.50 నోట్లు మహాత్మా గాంధీ సిరీస్ లో రానున్నాయి. కొత్త నోట్లు వచ్చినా, ఇప్పటికే అమల్లో ఉన్న పాత రూ.50 నోట్లు కూడా చెల్లుబాటు అవుతాయని ఆర్బీఐ స్పష్టం చేసింది.




## మినీ మేడారం జాతర ప్రారంభం

- మండమెలిగే పండుగతో షురూ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


ములుగు జిల్లా, మేడారంలోని సమ్మక్క సారమ్మల మినీ జాతర ప్రారంభమైంది. బుధవారం మండమెలిగే పండుగతో మినీ మేడారం జాతర ప్రారంభమైంది. ఈ జాతర ఈనెల 15 వరకు జరుగుతుంది. ప్రతి రెండేళ్లకోసారి మేడారం జాతర జరగనున్న నేపథ్యంలో మధ్యలో వచ్చే మేడారం జాతరను పూజారులు ఆదివాసి సంప్రదాయాల పద్ధతిలో మినీ మేడారం జాతరగా నిర్వహిస్తారు. మాఘశుద్ధ పౌర్ణమి నుండి నాలుగు రోజులపాటు మండమెలిగే పండగగా పూజారులు నిర్వహిస్తారు. మన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మేడారం గ్రామంలోకి దుష్టశక్తులు రాకుండా మామిడాకులతో దిష్టి తోరణాలు కట్టారు. పున్నమి వెలుగుల్లో పూజారులు జాగారాలు చేస్తూ నిష్టగా పూజలు నిర్వహించారు. పెద్ద జాతరకు రాలేకపోయిన భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు మినీ మేడారం జాతరకు వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

జాతరకు ముందు నుంచే భక్తులు వేలాదిగా వచ్చి వనదేవతలను దర్శించుకుంటున్నారు. అమ్మవార్లకు బంగారం, పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మినీ జాతరకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 5.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. రెండేళ్లకోసారి జరిగే మేడారం మహా జాతరకు భిన్నంగా మినీ మేడారం జాతర జరుగుతోంది. మండమెలిగే పండగ సందర్భంగా వనదేవతల పూజారులు ఉదయం మామిడి ఆకులతో తోరణాలు కట్టి గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పూజార్లు సమ్మక్క, సార్లమ్మ అమ్మవార్ల గద్దెలను శుద్ధి చేసి సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం సారలమ్మ పండగ సందర్భంగా ఏటూరునాగారం మండలం, కొండాయిలోని గోవిందరాజుల గుడిలో, పూనుగొండ్లలో పగిడిద్ద రాజు గుడితో పాటు కన్నెపల్లిలోని సరళమ్మ ఆలయాన్ని శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పూజారులు మేడారం ఆలయానికి చేరుకొని సారలమ్మ గద్దెను శుద్ధిచేసి ప్రత్యేక పూజలు నిర్వహించి మేడారంలోని వనదేవతల గద్దెల వద్దకు చేరుకొని సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దీప దూప నైవేద్యాలతో, జాగారాలతో వనదేవతలను కొలిచారు. అమ్మవార్ల పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించి మొక్కులు సమర్పించుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ మినీ జాతరలో కన్నయ్యగూడెం మండలం, ఐలాపూర్ గ్రామంలో ఆదివాసి గిరిజనులు సమ్మక్క సారలమ్మ ఆలయాలకు చేరుకున్న తర్వాత పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి, బంగారం, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మేడారం జాతర కంటే ఐలాపూర్‌లో మినీ జాతర అత్యంత ప్రాధాన్యం చోటుచేసుకుంది. ఏజెన్సీ ప్రాంతమైన ఐలాపూర్‌లో ఆదివాసి దేవతలైన సమ్మక్క, సారలమ్మలను గిరిజనులు దర్శించుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించుకుంటున్నారు.

# కులగణన రీ సర్వే






- 16 నుంచి 28 వరకు కులగణన
- మార్చి మొదటివారంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో బిల్లు
- కలిసొచ్చే పార్టీలతో సీఎం నేతృత్వంలో ఢిల్లీకి ప్రతినిధుల బృందం
- ప్రధానితో పాటు అన్ని పార్టీల నేతలనూ కలుస్తాం
- పార్లమెంట్‌లో ఓబీసీ రిజర్వేషన్ల బిల్లు కోసం ఒత్తిడి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో కులగణన రీ సర్వే చేపట్టనున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క వెల్లడించారు. 3.1 శాతం మంది కుల గణన సర్వేలో పాల్గొనలేదని.. వారి కోసం మళ్లీ సర్వే చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరి 16 నుండి 28 వరకు కులగణన రీ సర్వే చేపట్టనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సర్వేలో పాల్గొనని వాళ్లు ఆన్‌లైన్, టోల్ ఫ్రీ నంబర్ లేదా మండల కార్యాలయానికి వెళ్లి తమ వివరాలు ఇవ్వొచ్చని భట్టి తెలిపారు.

సచివాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలు కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో కులగణన సర్వే లెక్కలు వెల్లడించాం.. దీనిపై సభలో చర్చ కూడా జరిగిందని తెలిపారు. ఎంతో సహేతుకంగా సర్వే నిర్వహించి గణాంకాలు వెల్లడించామన్నారు. 3.1 శాతం ఇళ్లలో సర్వే నిర్వహించలేదని సభలోనే చెప్పామని.. కొందరు ఉద్దేశపూర్వకంగానే వివరాలు వెల్లడించలేదని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్ సహ పలువురు నేతలు సర్వేకు సహకరించలేదన్నారు. ఇప్పుడు మళ్లీ వారే రీసర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. మిగిలిపోయిన 3.1 శాతం మంది కోసం.. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు అవకాశం ఇస్తామని.. మూడు మార్గాల ద్వారా సర్వేకు వివరాలు ఇవ్వొచ్చని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై వచ్చేనెల కేబినెట్‌లో బిల్లు పెట్టబోతున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందాక దీన్ని కేంద్రానికి పంపుతామని.. పార్లమెంట్‌లో ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. ఇందుకోసం ప్రధాని, ఇతర రాజకీయ పార్టీలను కలుస్తామన్నారు.

రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు తాము కట్టుబడి ఉన్నామనీ, మార్చి మొదటి వారంలో అసెంబ్లీలో ఓబీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెడతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సీఎం నేతృత్వంలో కలిసొచ్చే పార్టీల నేతలతో ఢిల్లీకి ప్రతినిధుల బృందాన్ని తీసుకెళ్తామనీ, ప్రధానమంత్రి నరేంద్రమోడీతో పాటు అన్ని పార్టీల అగ్ర నేతలను కలిసి ఓబీసీ రిజర్వేషన్ల చట్టబద్ధతకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. పార్లమెంట్‌లో ఓబీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టేలా అన్ని పార్టీలపైనా ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. రాజకీయ ప్రయోజనాలు పక్కన పెట్టి బీసీ రిజర్వేషన్ల కోసం వివిధ పార్టీల నేతలు, సామాజికవేత్తలు, మేధావులు, ప్రజలంతా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర జనాభాలో ఓబీసీలు 56 శాతంగా ఉన్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, రాష్ట్ర ప్రణాళిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులతో కలిసి డిప్యూటీ సీఎం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి దశాబ్దాల కలను నిజం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కుల గణన విజయవంతమైతే దేశమంతటా అమలు చేయాల్సి వస్తుందని భయపడేవారే రీ సర్వే కోరుతున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా లక్ష మందికిపైగా సిబ్బందితో పూర్తిగా శాస్త్రీయంగా రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి సర్వే జరిగిందని స్పష్టం చేశారు.

## 3 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు విడుదల

- రూ.1230.98 కోట్లను విడుదల చేసిన ప్రభుత్వం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం నిధుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే రెండెకరాల లోపు భూమి కలిగిన రైతుల ఖాతాల్లో నగదు జమ చేసిన ప్రభుత్వం తాజాగా బుధవారం నుంచి మూడెకరాల లోపు భూమి ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోంది. మూడు ఎకరాల వరకు రైతు భరోసా నిధుల పంపిణీకిగాను రైతుల ఖాతాల్లో 1,230 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. మూడు ఎకరాలలోపు సాగు భూమికిగాను 9,54,422 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 1230.98 కోట్లు జమ అయ్యాయి.

ఇప్పటి వరకు ఎకరా, రెండెకరాలు, మూడెకరాల లోపు మూడు విడతల్లో కలిపి మొత్తం 58 లక్షల 13 వేల ఎకరాలకు 3487.82 కోట్ల రూపాయల మేర నిధులు 44,82,265 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. మొదటి విడతలో ఎకరా విస్తీర్ణం వరకు 17.03 లక్షల మంది రైతులకు 9.29 లక్షల సాగు భూమికి 557.54 కోట్ల రూపాయలు జమ అయ్యాయని తెలిపారు. రెండో విడతలో 13.23 లక్షల మంది రైతులకు 18.19 లక్షల ఎకరాలకు 1091.95 కోట్ల రూపాయలు, మూడో విడతలో 10.13 లక్షల మంది రైతులకు 21.12 లక్షల ఎకరాలకు 1269.32 కోట్ల రూపాయలు జమ అయ్యాయి.

## సర్వే తప్పుల తడక అని ప్రభుత్వం ఒప్పుకుంది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కులగణన సర్వే తప్పుల తడకని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని, దీనిని తాము స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "అయితే బీసీల జనాభాను తగ్గించి వెనకబడిన వర్గాల ప్రజలను తీవ్ర మానసిక వేదనకు గురిచేసినందుకు ముఖ్యమంత్రి రాష్ట్రంలోని బీసీలందరికీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలి. అసమగ్రంగా చేసిన సర్వేపై బీఆర్ఎస్ తోపాటు.. బీసీ సంఘాలు ముక్తకంఠంతో అభ్యంతరం వ్యక్తంచేసినా వినకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తి లెక్కల ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేయడం కూడా ముమ్మాటికీ తప్పేనని అంగీకరించాలి.

రెండోసారి సర్వేనైనా సమగ్రంగా చేయడంతోపాటు.. బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. కేవలం తూతూమంత్రంగా తీర్మానం చేసి.. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం పరిధిలోకి నెట్టి చేతులు దులుపుకుందామంటే మాత్రం బీఆర్ఎస్ తోపాటు.. బీసీ సంఘాలు ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించే ప్రసక్తే లేదు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన మాటను సంపూర్ణంగా నిలబెట్టుకునే వరకూ కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలోని బీసీలెవరూ నమ్మే పరిస్థితిలో లేరనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుపెట్టుకుంటే మంచిది.

## 14న కులగణన, రిజర్వేషన్ల వర్గీకరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ, కుల గణన, సర్వేతోపాటు.. ఎస్సీ రిజర్వేషన్లపై పార్టీ నేతలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 14న గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. గాంధీభవన్ ఆవరణలోని ప్రకాశం హాలులో మధ్యాహ్నం 2 గంటలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేయగా.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇంచార్జి ప్రధాన కార్యదర్శి దీపదాస్ మున్షీ హాజరుకానున్నారు.

కాగా, కులగణనపై మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సబ్ కమిటీ చైర్మన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కో చైర్మన్ మంత్రి దామోదర రాజ నర్సింహ, సభ్యులు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ మల్లు రవితో పాటు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పాల్గొని ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజక వర్గ బాధ్యులు, పోటీ చేసిన అభ్యర్థులు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, డీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యే లు, కార్యవర్గ ప్రతినిధులు, అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని టీపీసీసీ అధ్యక్షుడు కోరారు.

## సచివాలయంలో ప్రమాదం

- ఊడిపడిన పిఓపి పెచ్చులు
- దెబ్బతిన్న రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ వాహనం
- మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


సచివాలయంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఆరో ఫ్లోర్ సౌత్ భాగంలోని పట్టీ (పిఓపి పెచ్చులు) ఊడిపడ్డాయి. సిఎం చాంబర్ అంతస్తు మెయిన్ ఎంట్రన్స్ దగ్గర పిఓపి పార్టిషన్ కూలడంతో రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ వాహనం దెబ్బతింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడడంతో పెను ప్రమాదం తప్పింది. పిఓపి పెచ్చులు ఊడి పడటంతో అధికారులు, సెక్యూరిటీ అలర్ట్ అయ్యారు. అక్కడి నుంచి అందరినీ దూరం పంపించారు. పట్టీ మొత్తం కూలే అవకాశం ఉండడంతో వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఇప్పటికే సచివాలయంలో అక్కడక్కడ వాటర్ లీకేజీ అవుతుండడంతో గోడలు పెచ్చులూడు తున్నాయి. ఈ నేపథ్యంలోనే కొన్నిచోట్ల మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవలే నిర్మించిన తెలంగాణ సచివాలయం పిఓపీ కూలడం చర్చనీయాంశంగా మారింది. సచివాలయ నిర్మాణానికి రూ.1200 కోట్ల ఖర్చు కాగా, ఈ నిర్మాణం నాసిరకం అంటూ అప్పట్లో కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సచివాలయం ప్రారంభం రోజే అప్పటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి బిఆర్ఎస్ ప్రభుత్వం సచివాలయ నిర్మాణంపై విమర్శలు చేశారు.

సచివాలయంలో పెచ్చులు ఊడిన ఘటనపై షాపూర్ జి పల్లోంజీ స్పందించింది. నిర్మాణ సంస్థ రెగ్యులర్ డిపార్ట్‌మెంట్ వర్క్‌లో భాగంగా కేబుల్, లైటింగ్ కోసం పనులు చేస్తున్న సందర్భంలో ఈ ఘటన జరిగింది. నిర్మాణంలో ఎలాంటి సమస్య లేదు. అది కాంక్రీట్ వర్క్ కాదు. స్ట్రక్చర్‌కు ఎలాంటి ప్రాబ్లం లేదు. ఊడిపడింది జిఆర్‌సి ఫ్రేం మాత్రమేనని ఈ సంస్థ తెలిపింది. ఇటీవల లైటింగ్ కోసం, కొత్త కేబుల్స్ కోసం జిఆర్‌సి డ్రిల్ చేస్తున్నామని, డ్రిల్ చేస్తే జిఆర్‌సి డ్యామేజ్ అవుతుందని ఆ సంస్థ పేర్కొంది. స్ట్రక్చర్ నిర్మాణం పూర్తయి రెండేళ్లు అవుతుందని, ఎలాంటి నాణ్యత లోపం లేదని, తాము ఈ సంఘటనపై సమీక్ష చేస్తున్నామని షాపూర్ జి పల్లోంజీ తెలిపింది.

## నోటాకు కాంగ్రెస్ నో..!

- బీఆర్ఎస్ సుముఖత
- రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం సమావేశం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో స్థానిక సంస్థల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసింది. ఏకగ్రీవాలు లేకుండా ఎన్నికల నిర్వహణ, నోటా తదితర అంశాలపై వివిధ పార్టీల నేతల నుంచి అభిప్రాయాలు సేకరణ చేపట్టినట్టు తెలిసింది. .. అయితే రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. పంచాయతీ ఎన్నికల్లో నోటాను ప్రవేశపె ట్టాలన్న ప్రతిపాదనను అధికార కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. దీంతో ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే భేటీ ముగిసింది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా.. పంచాయితీ ఎన్నికల్లో నోటాను ప్రవేశపెట్టాలని ఈసీ ప్రతిపాదన చేసింది. దీనికి కాంగ్రెస్ తప్ప.. అన్ని రాజకీయ పార్టీల దాదాపుగా సానుకూలంగానే స్పందించాయి. నోటాతో ఎన్నిక ఖర్చు ఎక్కువ అని, ఒకవేళ నోటాతో ఎన్నిక నిర్వహించినా సెకండ్ లార్జెస్ట్ పార్టీనే విజేతగా ప్రకటించాలని కాంగ్రెస్ ఈసీని కోరింది. నోటాపై అభిప్రాయం సేకరణలో బీఆర్ఎస్ సానుకూలంగా స్పందించింది. ఏకగ్రీవానికి.. బెదిరింపులు, బలప్రదర్శన చేసే అవకాశం ఉందని ఈసీకి తెలిపింది. అలాగే.. కొత్త మండలాల వివరాలను రాజకీయ పార్టీలకు ఇవ్వాలని ఈసీని కోరింది. ఇదిలా ఉంటే.. సుప్రీంకోర్టులో కేసు ఉందని గుర్తుచేసిన బీజేపీ.. తమ అభిప్రాయం ఇప్పుడే చెప్పలేమని తెలిపారు. అయినప్పటికీ.. ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి నిర్ణయం తీసుకునే అవకాశం లేదని.. పంచాయతీ ఎన్నికలు ఎలా నిర్వహించాలనే నిర్ణయం ప్రభుత్వమే తీసుకోవాలని కమలం పార్టీ స్పష్టం చేసింది. నోటాతో ఎన్నిక ఉండాలని సుప్రీంకోర్టు ఇప్పటికే చెప్పిందని సీపీఐ(ఎం) గుర్తు చేసింది. అభ్యర్థి కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే రీ-ఎలక్షన్ కరెక్ట్ కాదు అని పేర్కొంది. ఎన్నిక కండక్ట్ చేయడం అవసరం.. నోటాకు ఎక్కువ ఓట్లు అనేది తర్వాత చర్చ అని వామపక్ష పార్టీ అభిప్రాయపడింది. ఇక.. తెలంగాణ టీడీపీ తమ అభిప్రాయాన్ని రెండు మూడు రోజుల్లో చెప్తామనగా, సింగిల్ అభ్యర్థిగా అయినా నోటా ఉండాలని జనసేన పార్టీ ఈసీకి విజ్ఞప్తి చేసింది.

## వనపర్తిలో ఐటీ టవర్లు..

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వనపర్తి జిల్లాకు ఐటీ టవర్‌ను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వనపర్తిలో బఫెట్ టవర్ మంజూరు చేస్తూ.. రూ.22 కోట్లు విడుదల చేసింది రేవంత్ సర్కార్. ఈ మేరకు ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మంజూరు చేసిన ఈ ఐటీ టవర్‌ను జిల్లా కేంద్రానికి సమీపంలోని నాగవరంలో రెండెకరాల స్థలంలో నిర్మించనున్నట్లు చిన్నారెడ్డి వెల్లడించారు. ఏడాదిలోగా దీని నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చిన్నారెడ్డి తెలిపారు.

## పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా వాతలు : హరీశ్‌రావు


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హోంగార్డులకు ప్రభుత్వం జీతాలు చెల్లించడంలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వ తీరు వల్ల రాష్ట్రంలోని 16 వేలకు పైగా హోంగార్డులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. పిల్లల ఫీజులు, ఇంటి అద్దెలు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా వాతలు అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 12 వ తేది వచ్చినా హోంగార్డులకు ఇంత వరకు జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటని హరీశ్ విమర్శించారు. చేతిలో చిల్లిగవ్వలేక హోంగార్డులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎంఐలు చెల్లించకపోవడంతో బ్యాంకు వాళ్లు ఫోన్లు చేసి నిలదీసే పరిస్థితి వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోందని చెప్పారు. దీనికి ముఖ్యమంత్రి ఏం సమాధానం చెపుతారని ప్రశ్నించారు. ఇది ప్రజా పాలన కాదని, ప్రజా వ్యతిరేక పాలన అని అన్నారు. హోంగార్డులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## ప్రధాని మోడీ 'క్లోజ్ ఫ్రెండ్' భారతీయులను బానిసల్లా చూస్తున్నాడు

### కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**



అక్రమ వలసదారుల పేరిట అనేకమంది భారతీయులను అమెరికా ప్రభుత్వం సైనిక విమానంలో తిప్పిపంప డంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థా యిలో స్పందించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనకు 'క్లోజ్ ఫ్రెండ్' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పుకుంటున్నారని, కానీ మోదీ 'క్లోజ్ ఫ్రెండ్' మనవాళ్లను బానిసల్లా చూస్తున్నాడని విమర్శించారు. అమెరికా నుంచి తిప్పి పంపిస్తున్న వారి పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తున్నారని, అలాంటి వారిని తీసుకువచ్చేందుకు భారత్ సొంత విమానం ఏర్పాటు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. అమెరికా పర్యటనకు వెళ్లిన మోదీ ఈ అంశంపై ట్రంప్ తో మాట్లాడాలని అన్నారు. అమెరికా మనకు మిత్ర దేశం... నేను ఏ అంశాన్నయినా పరిష్కరించగలను అని చెప్పుకుంటున్న మోదీ... ఇప్పుడీ అంశాన్ని పరిష్కరించాలని సూచించారు. మోదీ మాట ట్రంప్ వినేట్టయితే మనవాళ్లను ప్రయాణికుల విమానంలో కాకుండా ఇలా రవాణా విమానంలో ఎందుకు పంపించారని ఖర్గే ప్రశ్నించారు.

# 15న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

**తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ**

బలగం టీవీ , హైదరాబాద్

దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను సీఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు మండిపడ్డారు.అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మానిఫెస్టోలో ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, నెరవేర్చకుండా అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.బుధవారం హిమాయత్ నగర్ లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు బి.వెంకటేశం (ఏఐటీయూసీ), పి.శ్రీకాంత్ (సీఐటీయు), ఎంఏ.సలీం, ఎండి.నజీర్ (యుటిఏడబ్ల్యూ), నిరంజన్ (బీఆర్ టీయు), వి.ప్రవీణ్ (టీయుసీఐ), రామ్ రెడ్డి (ఐఎఫ్ టీయు), సిహెచ్.జంగయ్య, ఎస్.అశోక్, ఏ.శ్రీనివాస్, ఏం.కృష్ణ (ఏఐటీయూసీ) తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ 2014 నుండి పెండింగ్ లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కరించకుండా మోసం చేసిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకుండా మోసపూరిత వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు.ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గత కొంత కాలంగా తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ చేస్తున్న ఆందోళనలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టించుకోకపోవడం, సమస్యలను పరిష్కరించకుండా దాటవేస్తుండడం అన్యాయమన్నారు.ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం, ఇంధన చార్జీల పెంపునకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచడం, రవాణా రంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, కొత్త ఆటో పర్మిట్ల మంజూరు, రాష్ట్ర ప్రభుత్వమే రవాణా యాప్ ఏర్పాటు, స్కూల్ వ్యాన్లు, ఓలా, రాపిడో, ఉబర్ ద్విచక్ర వాహనాలు, ఇతర జిల్లాల ఆటోలను నిషేధించాలని తదితర న్యాయమైన జేఏసీ డిమాండ్ లు ఉన్నాయని, సీఎం ఎ.రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి పరిష్కరించాలని, లేనిపక్షం లో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలను తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరి నిరసిస్తూ, న్యాయమైన ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్ నారాయణగూడ ఫ్లై ఓవర్ కింద రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్నామని, అలాగే ఈ నెల 24న ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి బాగ్ లింగంపల్లి, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ రెండు కార్యక్రమాలకు ఆటో డ్రైవర్లు అందరు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## బయోమాస్ ప్లాంట్ రైతులకు ఉపయోగకరం

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

బలగం టీవీ , ఖమ్మం

ఖమ్మం జిల్లా మండల కేంద్రమైన తల్లాడలోని కొత్తగూడెం రోడ్ లో గల బయోమాస్ ప్లాంట్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో బయోమాస్ ప్లాంట్ రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, రైతులు ఆదరించి సహకరించి మేలు పొందాలని ఆయన అన్నారు. బయోమాస్ ప్లాంట్ వలన రైతులు పంటలు దిగుబడి అయిన తర్వాత పత్తి కట్టే, మిరప కట్టే, మొక్కజొన్న చెత్తను రైతులు కాలబెట్టకుండా బయోప్లాంట్ ద్వారా కాలుష్య నివారణ చేసేందుకు ఈ ప్లాంట్ ఎంత ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరావుకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.



## రాజ్యసభకు కమల్ హాసన్..!

బలగం టీవీ , హైదరాబాద్

మక్కల్ నిది మయ్యమ్ పార్టీ అధినేత, నటుడు కమల్ హాసన్‌ను తమిళనాడులోని అధికార డీఎంకే పార్టీ రాజ్యసభ కు పంపనుంది. ఈ మేరకు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్.. తన క్యాబినెట్ మంత్రి శేఖర్ బాబు ద్వారా కమల్ హాసన్‌కు సమాచారం పంపినట్టు తెలిసింది. కాగా ఈ ఏడాది జూలైలో డీఎంకే పార్టీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో కమల్ హాసన్‌ను పెద్దల సభకు పంపేందుకు డీఎంకే సమాయత్తమైంది. గత ఏడాది మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో డీఎంకేతో ఎంఎన్ఎం పొత్తు పెట్టుకుంది. అయితే ఈ ఎన్నికల్లో కోయంబత్తూరు నుంచి కమల్ హాసన్ బరిలో నిలవాలని భావించారు. కోయంబత్తూరులో ఆయన ఎన్నికల ప్రచారం కూడా నిర్వహించారు. కానీ ఈ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై బరిలోకి దిగారు. దాంతో డీఎంకే అధినేత సూచన మేరకు అక్కడి నుంచి పోటీ చేయాలనే ఆలోచనను కమల్ హాసన్ విరమించుకొన్నారు.

2019లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కోయంబత్తూరు లోక్ సభ స్థానం నుంచి పోటీచేసిన కమల్ హాసన్ ఓటమి పాలయ్యారు. 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత విజయ్ వ్యూహాత్మకంగా అడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం స్టాలిన్ తనదైన శైలిలో ప్రణాళికలు రచిస్తున్నారు. అందులో భాగంగానే కమల్ హాసన్‌ను రాజ్యసభకు పంపుతున్నారు. తద్వారా చిత్ర పరిశ్రమకు తమ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుందనే బలమైన సంకేతాలను ప్రజల్లోకి పంపాలనేది డీఎంకే ఆలోచన.

## ఫీజు చెల్లించాలని వేధించడంతో విద్యార్థిని ఆత్మహత్య

బలగం టీవీ , హైదరాబాద్



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలంలోని ప్రయివేటు పాఠశాలల ఆగడాలు రోజురోజుకి శతిమించి పోతున్నాయి.ఇటీవలే పట్టణంలోని క్రీక్ ప్లానెట్ స్కూల్లో ఓ విద్యార్థి ఫీజు కట్టలేదని సాయంత్రం 6గంటల వరకు స్కూల్లో ఉంచిన ఘటన మరువకముందే మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ ఫీజు కోసం వేధించడంతో పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ చైతన్య స్కూల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థి అఖిలను తన తోటి విద్యార్థుల ముందే ప్రిన్సిపాల్ రమాదేవి ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేసింది. దాంతో మానసిక ఒత్తిడికి గురైన సదరు విద్యార్థిని మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. దాంతో కుటుంబసభ్యులు ఆమెను యశోద ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆమె చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. అంతకుముందు విద్యార్థిని తల్లి కమల పాఠశాల వద్దకు వచ్చి మీడియాతో మాట్లాడారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఫీజు కోసం వేధించడం వల్లే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే స్కూల్ లో పదో తరగతి చదువుతున్న తన కొడుకును సైతం ఇంగ్లీషులో తక్కువ మార్కులు వచ్చాయని వేధించడంతో అతను మానసిక ఒత్తిడికి గురై ఇబ్బంది పడుతున్నాడని తెలిపారు. సైకాలజీ డాక్టర్ దగ్గర ట్రీట్మెంట్ తీసుకుంటున్నాడని ఆ చికిత్స కోసమే లక్ష రూపాయల డబ్బులు చెల్లించడంతో స్కూల్ ఫీజు కట్టడం ఆలస్యమైందని తెలిపారు. ఫీజుల విషయంలో అడ్డదారులు తొక్కుతూ మానసిక వేదన గురి చేస్తున్న శ్రీ చైతన్య స్కూల్ పై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సమాచారం అందుకున్న ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నాయకులు స్కూల్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫీజు కోసం ఒత్తిడి చేసి విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన ప్రిన్సిపాల్ రమాదేవిపై బీఎన్ఎస్ యాక్ట్ 55 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ బీ.శ్రీనివాస్ తెలిపారు.

## విద్యార్థినీ అనుమానాస్పద మృతి

బలగం టీవీ , హైదరాబాద్



ఇంటర్మీడియట్ విద్యార్థిని అనుమానాస్ప దంగా మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కృష్ణాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు దేవి దంపతుల కూతురు పూజిత బాచుపల్లి మండలం సాయి కృష్ణ హిల్స్ ఎస్సార్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువు తున్నది. ఆమె బుధవారం తాను ఉంటున్న గదిలో ఆత్మ హత్య చేసుకుంది. అయితే కళాశాల యాజమాన్యం.. బాధిత కుటుంబ సభ్యులకు తెలియ కుండా వెంటనే ఆస్పత్రికి తరలించి, ఆ తరువాత కుటుంబ సభ్యులకు బాత్ రూములో కాలుజారి పడిపోయి ప్రమాదానికి గురై చనిపోయిందని తెలిపారు. ఆ తరువాత రూమ్ లో రాసిన సూసైడ్ లెటర్ దొరికిందని యాజమాన్యం తెలపడంతో ఆగ్రహంతో కుటుంబ సభ్యులు కళాశాల యాజమాన్యం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కూతురు మరణంపట్ల యాజమాన్యం పొంతన లేని సమాధానాలు తెలుపుతున్నదని.. కుటుంబ సభ్యులు కళా శాల ఎదుట ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. బాచుపల్లి పోలీసులు ఆందోళన జరగకుండా శాంతింప జేసేందుకు ప్రయత్నించారు. అయితే బాధిత కుటుంబ సభ్యులు మాత్రం తమ కూతురు మృతి విషయాన్ని వెంటనే ఎందుకు తెలుపలేదని ప్రశ్నించారు. బాచుపల్లి పోలీసులు కేసు నమో నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఫ్రాన్స్‌లో భారత్ నూతన కాన్సులేట్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ

బలగం టీవీ , హైదరాబాద్



ఫ్రాన్స్ లోని మార్సెయిల్‌లో భారత నూతన కాన్సులేట్ ను ప్రధాని నరేంద్రమోడీ , ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. అంతకు ముందు మేక్రాన్‌తో కలిసి భారత అమరవీరులకు మోడీ నివాళులు అర్పించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన భారత సైనికుల త్యాగాలకు గుర్తుగా గతంలో ఆ దేశ ప్రభుత్వం మార్సెయిల్ ప్రాంతంలో యుద్ధ స్మారకం నిర్మించింది. కామన్వెల్త్ వార్ గ్రేవ్స్ కమిషన్ చే దీని నిర్వహణ బాధ్యతలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగినట్లు పీఎంఓ వెల్లడించింది. ద్వైపాక్షిక సంబంధాలు , అంతర్జాతీయ, ప్రాంతీయ సమస్యలపై చర్చలు జరిపినట్లు పేర్కొంది. సాంకేతికత, రక్షణ , పౌర అణుఇంధనం , అంతరిక్షం తదితర రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని అంగీకారానికి వచ్చినట్లు సమాచారం. ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ మంగళవారం పారిస్ వేదికగా జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి సహ అధ్యక్షుడిగా వ్యవహరించారు. పలుదేశాల అధినేతలు టెక్ రంగ నిపుణులను ఉద్దేశించి ప్రసంగించారు. నేటితో ఫ్రాన్స్ పర్యటనను ముగించుకుని అమెరికాకు చేరుకోనున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అవుతారు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి భేటీ కానున్న ప్రధాని మోడీ పలు అంశాలపై చర్చలు జరిపే అవకాశం ఉంది.

## రాహుల్‌కు లక్నో కోర్టు సమన్లు

బలగం టీవీ , హైదరాబాద్

కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్‌కు లక్నో కోర్టు సమన్లు జారీ చేసింది. తన భారత్ జోడో యాత్రలో భాగంగా 2022లో ఆర్మీపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యల ఆరోపణలపై న్యాయస్థానం ఈ చర్యకు దిగింది. ఈ కేసు తదుపరి విచారణను అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేటు అలోక్ వర్మ వచ్చే నెల 24కు నిర్ణయించారు. దీనికి రాహుల్ హాజరు కావాల్సి ఉంటుంది. అంతకుముందు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ మాజీ డైరెక్టర్ ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ తరపున లాయర్ వివేక్ తివారీ.. రాహుల్‌పై పరువు నష్టం దావా వేశారు. " భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్.. డిసెంబర్ 16, 2022న ఈ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. కొందరు మీడియా వ్యక్తులతో మాట్లాడుతూ.. డిసెంబర్ 9న చోటు చేసుకున్న భారత్, చైనా ఆర్మీల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ గురించి ఆయన అభ్యంత రకరంగా మాట్లాడారు" అని లాయర్ వివేక్ తివారీ వివరించారు.

## 'ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఓడించండి'

బలగం టీవీ , హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల 27న జరిగే శాసనమండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎ విజయరాఘవన్ హాజరయ్యారు. అనంతరం తనను కలిసిన విలేకర్లతో జాన్‌వెస్లీ మాట్లాడుతూ శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో లౌకిక శక్తులను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీని ఓడించే అభ్యర్థులకు మద్దతివ్వాలని నిర్ణయించామని చెప్పారు. ఎవరికి మద్దతివ్వాలనేది తర్వాత నిర్ణయం తీసుకుంటామని వివరించారు. కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిందని గుర్తు చేశారు. కులగణన వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్నదని అన్నారు. అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పోలీసులు అధునాతన టెక్నాలజీని సద్వినియోగించుకోవాలి

**-ఎస్పీ అఖిల్ మహాజన్**

**-జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్..**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ కూడా అధునాతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవడం తో పాటుగా అన్ని రకాల ఆయుధ పరిజ్ఞానం కూడా కలిగి ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.బుధవారం పోలీస్ అధికారులకు, సిబ్బందికి వార్షిక మొబైలైజేషన్ లో భాగంగా జిల్లాలోని సార్ధపూర్ బెటాలియన్ లో గల ఫైరింగ్ రేంజ్ నందు ఫైరింగ్ శిక్షణను ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గారు పర్యవేక్షించారు.అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ కూడా ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.ఈ శిక్షణలో నేర్పించిన మెలకువులను శ్రద్ధతో అభ్యసించి సమయానుకూలంగా శాంతిభద్రతలు పరిం ్క్షణకు ఉపయోగించాలని అన్నారు. ఫైరింగ్ లోఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులను సిబ్బందిని అభినందించారు. ఈ శిక్షణలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ మురళి కృష్ణ, సిఐ లు, ఆర్ఐ లు, ఎస్ఐ లు,ఆర్ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు...



## ఘనంగా శ్రీ గోవిందరాజుల స్వామి వారి కళ్యాణం..

**బలగం టీవీ , చందుర్తి**

చందుర్తి మండలం సనుగుల గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ గోవిందరాజుల స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు.స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు.స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని వేడుకున్నారు..

# సభ్యత్వ నమోదులో తెలంగాణ ముందంజ



**-రాజన్న సిరిసిల్ల జిల్లాను సైతం ముందు వరుసలో నిలబెట్టాలి.**

**-మహిళా కాంగ్రెస్ జిల్లా ఇంచార్జి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణవేణి..**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

సభ్యత్వ నమోదులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో నిలిచిందని, అదే స్ఫూర్తితో రాజన్న సిరిసిల్ల జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలపాలని రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా కాంగ్రెస్ ఇంచార్జీ కృష్ణవేణి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో జిల్లా మహిళా కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా విభాగం సభ్యత్వ నమోదు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇంచార్జ్ కృష్ణవేణి హాజరై మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాకు రావడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం చెయ్యడానికి మొదలైన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి మహిళా నాయకురాలు విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. సభ్యత్వం నమోదు ప్రక్రియలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని, రాజన్న సిరిసిల్ల జిల్లాను సైతం రాష్ట్రం లో ముందు నిలిపేలా ప్రతి ఒక్కరు తమ వంతు తోడ్పాటును అందించాలన్నారు. ఇప్పటివరకు సభ్యత్వం నమోదు చేయని మహిళా కాంగ్రెస్ సభ్యులు సభ్యత్వ నమోదు ప్రక్రియను మొదలు పెట్టాలని సూచించారు. రానున్న రోజుల్లో వచ్చే ఎన్నికలలో అవకాశం వస్తే ప్రతి మహిళా పోరాడి,విజయం సాధించాలని అన్నారు . ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి గడప గడపకు తీసుకెళ్లి అర్థం అయ్యేలా వివరించాలని కోరారు.జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనితమాట్లాడుతూ గత సెప్టెంబర్ 15 నుండి మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం రోజు నుండి సభ్యత్వం నమోదు ప్రక్రియ ప్రారంభం అయిందన్నారు. సభ్యత్వం నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. మహిళ కాంగ్రెస్ లో జిల్లా విభాగంలో బాధ్యతలు నిర్వహిస్తున్న వారందరు సభ్యత్వం నమోదు చేయించాలని కోరారు. ఈ సమావేశంలో

ఏఎంసి చైర్మన్ %ఉ% సిరిసిల్ల టౌన్ అధ్యక్షురాలు వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ కోడం అరుణ, సీనియర్ నాయకురాలు మడుపు శ్రీదేవి, గట్టు రుక్మిణి, సత్య లక్ష్మి, మండలాల అధ్యక్షురాలు హారిక , లహరి,లత, సత్య ప్రసన్న, రాజ్యలక్ష్మి, లహరి, సుధా, రోజా, సరిత, లత, తదితరులు పాల్గొన్నారు.



## రాజన్న సేవలో అమెరికా భక్తులు..

**-కోడె మొక్కులు చెల్లింపులు**

**బలగం టీవీ , వేములవాడ**

వేములవాడ శ్రీపార్వతి రాజరాజేశ్వర స్వామి వారిని హైదరాబాదులోని కూకట్ పల్లి చెందిన వీరభద్రరావు కుటుంబ సమేతంగా బుధవారం వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకొని, కోడె మొక్కులు చెల్లించారు. వీరభద్రరావు, అమెరికా నివాసి అయిన తన భార్య పిటర్, తల్లి దండ్రులతో కలిసి దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారని,అమెరికా లోనే సెటిల్ అయినట్టు కోడె మొక్కులు చెల్లించుకున్నమని,స్వామి వారు మా ఇంటి ఇలవేల్పు అని చెప్పారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ప్రజలు అవస్థలు పడుతుండ్రు

**-చల్మెడ లక్ష్మీ నరసింహా రావు**

**బలగం టీవీ , వేములవాడ**

కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ప్రజలు అవస్థలు పడుతుండ్రని బిఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీ నరసింహ రావు అన్నారు.బుధవారం వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలోని ఫంక్షన్ హాల్ లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా, ఈ సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీ నరసింహా రావు హాజరై మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో అబద్దాలు చెప్పి గెలిచిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. కెసిఆర్ పదేండ్ల పాలనలో ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని, గడిచిన కాంగ్రెస్ పార్టీ ఏడాది కాలంలో ప్రజలు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, రైతులకు ఇచ్చే రైతు భరోసా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల పనిచేసి బిఆర్ఎస్ బలాన్ని బలగాన్ని చూపించాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు గోసుకుల రవి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు ఏస తిరుపతి, గడ్డం హనుమాన్లు, తాజా మాజీ సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డార్విన్ సిద్ధాంతం నేటికి అవసరం

**బలగం టీవీ , సిరిసిల్ల**




ప్రకృతికి, జీవుల మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని శాస్త్రీయంగా సైద్ధాంతికంగా నిరూపించి, మానవ సమాజానికి అనువర్తనం చేసిన గొప్ప శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ అని రంగినేని మోహన్ రావు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలో రంగినేని మోహన్ రావు ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆవరణంలో చార్లెస్ జయంతి సందర్భంగా పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగినేని మోహన్ రావు మాట్లాడుతూ... డార్విన్ సిద్ధాంతం నేటికి ఆచరణీయంమని,దాన్ని విద్యార్థుల పాఠ్యాంశంలో బాగం చేసి విస్తృత ప్రచుర్యం కల్పించాలని అన్నారు.నేటి సాంకేతిక యుగంలో భారత్ సుడో సైన్స్ వాదనల నుంచి బయటపడాలని,ప్రశ్నించే తత్వంతో కూడిన పౌర సమాజానికి పునాది వేయాలని అన్నారు.అప్పుడే భారతదేశం అన్ని రంగాలు అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు సి. రామరాజు , జిల్లా అధ్యక్షులు సిలువేరి సంపత్ కుమార్, జనరల్ సెక్రెటరీ ప్యారం లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు బుర్ర గోపాల్ , శ్రీహరి, మధు, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

# ఫైనల్‌కు పాకిస్థాన్



**బలగం టీవీ, హైదరాబాద్**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి ముందు పాకిస్థాన్‌లో జరుగుతున్నముక్కోణపు వన్డే సిరీస్‌లో పాకిస్థాన్ ఫైనల్ చేరింది. సౌతాఫ్రికాతో బుధవారం జరిగిన ఉత్కంఠ పోరులో పాకిస్థాన్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్, సల్మాన్ అఘా అద్భుత శతకాలతో పాక్ విజయంలో కీలక పాత్ర పోషించారు.

ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 352 పరుగులు చేసింది. కెప్టెన్ టెంబా బవుమా(96 బంతుల్లో 13 ఫోర్లతో 82), యువ ఓపెనర్ మాథ్యూ బ్రిట్జ్‌కీ(84 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 83), హెన్రీచ్ క్లాసెన్(56 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లతో 87) హాఫ్ సెంచరీలతో రాణించారు. చివర్లో కైల్ వెర్రెయిన్(32 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 44 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. పాకిస్థాన్ బౌలర్లలో షాహిన్ షా అఫ్రిది(2/66) రెండు వికెట్లు తీయగా.. నసీమ్ షా, కుష్‌దిల్ షా తలో వికెట్ దక్కించుకున్నారు.

అనంతరం పాకిస్థాన్ 49 ఓవర్లలో 4 వికెట్లకు 355 పరుగులు చేసి గెలుపొందింది. కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్(128 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 122 నాటౌట్), సల్మాన్ అఘా(103 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్స్‌లతో 134 ) అజేయ శతకాలతో చెలరేగారు. మాజీ కెప్టెన్ బాబర్ ఆజామ్(23), సౌద్ షకీల్(15)మరోసారి నిరాశపర్చగా.. ఫకార్ జమాన్(41) పర్వాలేదనిపించాడు. సౌతాఫ్రికా బౌలర్లలో వియాన్ మల్డర్(2/79) రెండు వికెట్లు తీయగా.. కోర్బిన్ బోస్చ్ ఓ వికెట్ పడగొట్టాడు. ఇక శుక్రవారం జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌తో పాకిస్థాన్ ఆడనుంది.

# ఇంగ్లండ్‌పై భారత్ క్లీన్‌స్వీప్

- **142 పరుగుల తేడాతో నెగ్గిన భారత్**
- **సిరీస్ 3-0తో భారత్ కైవసం**



**బలగం టీవీ, హైదరాబాద్**


అహ్మదాబాద్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో 142 పరుగుల తేడాతో భారత్‌ఘన విజయం సాధించింది. తద్వారా మూడు వన్డేల సిరీస్‌ను 3–0 తేడాతో టీమిండియా క్లీన్ స్వీప్ చేసింది. 357 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 34.2 ఓవర్లలో 214 పరుగులకే ఆలౌటైంది.

ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 356 పరుగులకు ఆలౌటైంది. శుభ్‌మన్ గిల్ (102 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లతో 112) శతకంతో చెలరేగగా.. విరాట్ కోహ్లీ(55 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 52), శ్రేయస్ అయ్యర్(64 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 78) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్(4/64) నాలుగు వికెట్లు తీయగా.. మార్క్ వుడ్(2/45) రెండు వికెట్లు పడగొట్టాడు. సకీబ్ మహ్మూద్, గస్ అట్కిన్సన్, జోరూట్ తలో వికెట్ తీసారు.

అనంతరం లక్ష్యచేధనకు దిగిన ఇంగ్లండ్ 34.2 ఓవర్లలో 214 పరుగులకు కుప్పకూలి ఓటమిపాలైంది. టామ్ బాంటన్(41 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38), గస్ అట్కిన్సన్(19 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 38) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు.

### అదరగొట్టిన శుబ్‌మన్..

టీమిండియా బ్యాటర్లలో శుబ్‌మన్ గిల్ (102 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లతో 112) సెంచరీతో చెలరేగగా.. విరాట్ కోహ్లీ(55 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 52), శ్రేయస్ అయ్యర్(64 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 78) హాఫ్ సెంచరీలతో రాణించారు. ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్, ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు రెండూ శుబ్‌మన్ గిల్‌కే దక్కాయి.



# సచిన్ రికార్డ్ బద్దలుకొట్టిన విరాట్

**బలగం టీవీ, హైదరాబాద్**



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంగ్లండ్‌పై 4వేల పరుగులు చేసిన తొలి భారత బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు. ఈ క్రమంలో సచిన్ టెండూల్కర్‌ను కోహ్లీ అధిగమించాడు. ఇంగ్లండ్‌తో అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న మూడో వన్డేలో కోహ్లీ మూడు ఫార్మాట్లలో కలిపి 4000 ప్లస్ రన్స్ చేశాడు. ఇప్పటివరకు సచిన్ టెండూల్కర్ చేసిన 3990 రన్స్ అత్యధికంగా ఉన్నాయి. సౌతాఫ్రికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా దేశాలపై అంతర్జాతీయ క్రికెట్‌లో మూడువేలకు పైగా పరుగులు చేసిన తొలి భారత బ్యాటర్‌గా కూడా కోహ్లీ నిలిచాడు. ఆస్ట్రేలియాపై 5000 ప్లస్ రన్స్ చేసిన కోహ్లీ.. ఇంగ్లండ్‌పై 4000 ప్లస్ రన్స్, సౌతాఫ్రికాపై 3000 ప్లస్ రన్స్ నమోదు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు దేశాలపై 4000 ప్లస్ రన్స్ చేసిన బ్యాటర్‌గా కోహ్లీ రికీ పాంటింగ్ రికార్డ్‌ను సమం చేశాడు. కోహ్లీ, పాంటింగ్ చెరో మూడు దేశాలపై 4000 ప్లస్ రన్స్ చేయగా.. సచిన్ రెండు దేశాలపై ఈ ఫీట్ సాధించాడు. ఆసియా గడ్డపై మూడు ఫార్మాట్లలో కలిపి అత్యంత వేగంగా 16 వేల పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గానూ కోహ్లీ చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో సచిన్ రికార్డ్‌ను కోహ్లీ అధిగమించాడు. సచిన్ 353 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఫీట్ సాధిస్తే.. కోహ్లీ 340 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనతను అందుకున్నాడు.

# విజయ్ దేవరకొండ కొత్త మూవీ 'కింగ్‌డమ్'

- **ఎన్టీఆర్ వాయిస్‌తో టీజర్ విడుదల**




**బలగం టీవీ, హైదరాబాద్**


విజయ్ దేవరకొండ, గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్ లో 'వీడీ 12' వర్కింగ్ టైటిల్ తో రూపుదిద్దుకుంటున్న కొత్త చిత్రం టీజర్, టైటిల్ తాజాగా విడుదలైంది. ఈ చిత్రానికి 'కింగ్‌డమ్' అనే పవర్‌ఫుల్ టైటిల్ ను ఖరారు చేశారు. ఇక టీజర్ కు ఎన్టీఆర్ వాయిస్ ఇచ్చిన విషయం తెలిసిందే. తారక్ వాయిస్ తో తాజాగా విడుదలైన టీజర్ మరింత పవర్‌ఫుల్‌గా కనిపించింది. విజయ్ లుక్ కూడా డిఫరెంట్‌గా ఉంది. ఆయన యాక్షన్ ఎపిసోడ్స్, ఎమోషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. మొత్తానికి ఈ టీజర్ తో మేకర్స్ సినిమాపై అంచనాలు పెంచేశారు. అనిరుధ్ రవిచందర్ బాణీలు అందిస్తున్న కింగ్‌డమ్ సినిమా ఈ వేసవి కానుకగా మే 30న వరల్డ్‌వైడ్ గా విడుదల కానుంది.



**ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దక్షిణాది రాష్ట్రాల ఆలయాల సందర్శనలో ఉన్న విషయం తెలిసిందే. తన కొడుకు అకీరాతో కలిసి కేరళ, తమిళనాడులోని ప్రసిద్ధ ఆలయాలను సందర్శి స్తున్నారు. 4 రోజుల పాటు, 11 ఆలయాలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సందర్శించ నున్నారు. అలాగే టెంపుల్ టూర్ కోసం దీక్ష వస్త్రాలు ధరించారు పవన్ కల్యాణ్. ఆలయాల సందర్శనలో భాగంగా కేరళలోని కొచ్చి సమీపంలో ఉన్న అగస్త్య మహర్షి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు పవన్ కళ్యాణ్. తన కొడుకుతో కలిసి ఈ ఆలయానికి వెళ్లిన జనసేనాని ఆలయంలో అగస్త్య మహర్షిని దర్శించుకున్నాడు.**

# ఆర్టీసీ బస్సులో 'తండేల్'

**బలగం టీవీ, హైదరాబాద్**



నాగచైతన్య, సాయిపల్లవి కాంబినేషన్లో వచ్చిన 'తండేల్' సినిమా సూపర్ హిట్ అయింది. అయితే ఈ సినిమాను పైరసీ భూతం వదలడం లేదు. విడుదలైన రెండు రోజులకే ఈ సినిమాను పలాస నుంచి విజయవాడ వెళ్లిన ఏపీఎస్ఆర్టీసీ బస్సులో ప్రదర్శించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ ఆర్టీసీ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై విచారణ చేపట్టాలని ఆర్టీసీ ఛైర్మన్ ఆదేశించారు. అయినా తాజాగా మరోసారి ఆర్టీసి బస్సులో 'తండేల్' సినిమాను ప్రదర్శించారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్లే బస్సులో ఈ సినిమా వేశారు. ఈ విషయాన్ని నిర్మాత బన్నీ వాసు ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'తండేల్' సినిమాను ప్రదర్శిస్తున్న వీడియోను, బస్సు టికెట్ ను షేర్ చేశారు.

# నేను హారర్ జానర్ సినిమాలు చేయను : విశ్వక్‌సేన్

**బలగం టీవీ, హైదరాబాద్**

విశ్వక్ సేన్ లైలా సినిమాతో రాబోతున్న సంగతి తెలిసిందే. షైన్ స్క్రీన్స్ నిర్మాణంలో రామ్ నారాయణ్ దర్శకత్వంలో విశ్వక్ సేన్ హీరోగా 'లైలా' సినిమా తెరకెక్కింది. ఈ సినిమాలో విశ్వక్ లేడీ గెటప్ లో కనిపించబోతున్నాడు. ఆకాంక్ష శర్మ హీరోయిన్ గా నటిస్తుంది.ఈ సినిమా ఫిబ్రవరి 14న రిలీజ్ కానుంది. తాజాగా విశ్వక్ మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాడు.

" నేను హారర్ జానర్ సినిమాలు చేయను. అసలు ఫ్యూచర్ లో కూడా హారర్ జానర్ సినిమాలు ఎప్పటికి చేయను. ఎందుకంటే నేను హారర్ కి భయపడను కాబట్టి. అందరూ చాలా భయపడ్డాం అనే సినిమాలకు కూడా నేనొక్కడ్నే వెళ్లి చూసొచ్చాను. అసలు హారర్ సినిమాలకు, సౌండ్స్ కి నేను భయపడను.

ఊరికి చివర ఒక విల్లాలో నన్నొక్కడ్ని వదిలేసి హారర్ సౌండ్స్ పెట్టినా సైలెంట్ గా పడుకుంటాను తప్ప భయపడను. స్మశానంలో కూడా నేను హ్యాపీగా పడుకుంటాను. ఒక దయ్యం మనిషిని చంపింది అని రియాలిటీలో లేదు. అందుకే నేను భయపడను. నేను భయపడనప్పుడు, హారర్ భయం తెలియనప్పుడు నేను ఆ జానర్ సినిమా చేయలేను అని తెలిపారు.

అయితే విశ్వక్ డైరెక్టర్ కూడా కావడంతో మరి మీరు భయపడట్లేదు మీరే దర్శకుడిగా హారర్ సినిమా తీసి భయపెట్టొచ్చు కదా అని అడిగినా దానికి కూడా నేను చేయను అనే సమాధానం ఇచ్చారు. దీంతో ఎన్ని రకాల జానర్స్ లో విశ్వక్ సినిమాలు చేసినా హారర్ జానర్లో మాత్రం చేయడు అని క్లారిటీ వచ్చేసింది.